క్లుప్తంగా

ప్రసన్న పరామర్శ



వనమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రసన్న

కోవూరు : మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం కోవూరు పట్టణంలో పలువురిని పరామర్శించారు. కోవూరు శాంతినగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నేత మావులూరి వెంకటరమణారెడ్డి తల్లి వనమ్మ ఉత్తరక్రియల్లో పాల్గొని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే కాపువీధికి చెందిన పచ్చిపాల శ్రీనివాసులురెడ్డి తల్లి సుగుణమ్మ ఇటీవల మరణించగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కవరగిరి శ్రీలత, పార్టీ మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, పార్టీ నేతలు రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, నీలపరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి, తలపుల వేణు, షేక్.జుబేర్, కలికి శ్రీధర్‌రెడ్డి, ఈదల సుధీర్‌కుమార్‌రెడ్డి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరికరాల అందజేత



పొదలకూరు: మండలంలోని మహ్మదాపురం పీహెచ్‌సీకి అత్యాధునిక వైద్య పరికరాలను హైదరాబాద్ అమేర్ గ్రూప్, ఎస్‌బీఐ సహకారంతో బుధవారం అందజేశారు. హైడ్రాలిక్ బెడ్‌కాట్, వీల్‌చైర్ – 2, ఆపరేషన్ థియేటర్ టేబుల్, స్టాండింగ్ బీపీ ఆపరేటస్, నార్మల్ బెడ్ కాట్స్ – 2.. మొత్తం రూ.రెండు లక్షల విలువైన పరికరాలను పంపిణీ చేశారు. ఎస్‌బీఐ మేనేజర్ పీఎస్ రాజు, గ్రూప్ చైర్మన్ మాధవన్, డైరెక్టర్ వరుణ్, వైద్యాధికారులు నరసింహారావు, శ్రీకావ్య తదితరులు పాల్గొన్నారు.

నేతాజీకి కళా నివాళి



పొదలకూరు: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని మహ్మదాపురానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య కళా నివాళులర్పించారు. నేతాజీ చిత్రాన్ని రావి ఆకుపై గీసి స్మరించుకున్నారు.

కావలి ఆర్డీఓ పరిశీలన



విడవలూరు : మండలంలోని ఊటుకూరు పెద్దపాళెం గ్రామంలోని ఎల్పీఎస్ భూములను కావలి ఆర్డీఓ వంశీకృష్ణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018–19 మధ్య మండలంలోని 90 మంది ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం ఎకరా చొప్పున పొలం ఇచ్చిందని, అయితే ఆ భూములు ఎక్కడుందో తెలియక హద్దులు ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. త్వరితగతిన హద్దులు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. తహసీల్దార్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కోవూరులో డీఎల్‌పీఓ విచారణ



కోవూరు : కోవూరు గ్రామ పంచాయతీ పరిధిలో నెల్లూరు డీఎల్‌పీఓ పుట్టా రమణయ్య బుధవారం విచారణ చేపట్టారు. గతంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన శివకుమార్ కోవూరు శాంతినగర్ మూడో వీధిలో అనుమతుల్లేని లేఅవుట్‌లో భవన నిర్మాణానికి అనుమతులు ఇచ్చినట్లు లోకాయుక్తకు చేసిన ఫిర్యాదు అందిన నేపథ్యంలో ఆయన క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. ఆయన వెంట పంచాయతీ విస్తరణాధికారి సి.శ్రీనివాసులు, ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కసుమూరులో పశు వైద్యశిబిరం

వెంకటాచలం: మండలంలోని కసుమూరులో పశు వైద్యశిబిరాన్ని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, డీ వార్మింగ్ మందులను ఉచితంగా పంపిణీ చేశారానని రైతులను అడిగి తెలుసుకున్నారు. పశువులకు వచ్చే అన్ని రకాల వ్యాధులపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. దూడలకు నట్టల నివారణ మందులు వేయించి పలు సూచనలు చేశారు. పశు వైద్యాధికారి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మినుము రైతు కుదేలు

- సాగుతో నష్టాలు
- ఎకరాకు రెండు బస్తాలే దిగుబడి
- ధరలూ అంతంతమాత్రమే
- కోలుకోలేని స్థితిలో అన్నదాతలు



నూర్పిడి పనులు చేస్తున్న కూలీలు

పొదలకూరు: మండలంలో పప్పు ధాన్యాల సాగును రైతులు గణనీయంగా తగ్గించారు. రబీలో కొందరు రైతులు స్వల్పంగా మినుము, పెసర సాగు చేపట్టారు. అయితే తుఫాన్ ప్రభావంతో వానలు, ముసురు పట్టుకోవడంతో మినుము బాగా దెబ్బతిని దిగుబడి తగ్గిపోయింది. దీంతో రైతులు నష్టాలకు గురయ్యారు. పెట్టుబడులు రాకపోగా అప్పులపాలవుతున్నారు. ధరలూ అంతంత మాత్రంగానే ఉండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు 500 ఎకరాల్లో మినుము, పెసరను సాగు చేశారు. గత పదేళ్లతో పోలిస్తే మెట్ట రైతులు పప్పు ధాన్యాల సాగు జోలికి కనీసం ఐదు శాతం వెళ్లలేదు. ఈ ఏడాదైనా కొంత కలిసొస్తుందని ఆశించిన రైతులు నష్టపోయారు.

మినుము నూర్పిడి పనులు

మండలంలోని మొగళ్లూరు, కనుపర్తి, చెన్నారెడ్డిపల్లి, నావూరు, దుగ్గంట పంచాయతీ, పులికల్లు, అంకుపల్లి, పొదలకూరు, ప్రభగిరిపట్నం తదితర గ్రామాల్లో రైతులు మినుము సాగు చేశారు. సంక్రాంతి తర్వాత మినుము, పెసర నూర్పిడి పనులు చేపట్టారు. కనీసం నాలుగు బస్తాలు దిగుబడైతే రైతులు పెట్టిన పెట్టుబడులొచ్చే అవకాశం ఉంటుంది. అయితే రెండు బస్తాల దిగుబడే రావడంతో నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. ఎకరాలో సాగుకు రూ.22 వేల వరకు అవుతుందని రైతులు వెల్లడించారు. ఇక్కడి రైతులు కొందరు బయటి ప్రాంతాలకు వెళ్లి 50 నుంచి 100 ఎకరాల వరకు సాగు చేస్తుండగా, వారూ నష్టపోయారని తెలుస్తోంది. మార్కెట్లో క్వింటాల్ మినుము ప్రస్తుతం రూ.6500 నుంచి రూ.ఏడు వేలే పలుకుతోంది. ఫలితంగా రెండు బస్తాల దిగుబడి సాధించిన రైతులు ఎకరాకు రూ.ఎనిమిది వేల వరకు నష్టపోతున్నారు.

దిగుబడి నామమాత్రం



రెండెకరాల్లో మినుము సాగు చేశా. ఎకరాకు రెండు బస్తాలే దిగుబడయ్యాయి. కూలీల ఖర్చులు, పెట్టుబడులు చూస్తే నష్టమొస్తోంది. కూలీలు లభ్యం కాక సొంత మనుషులతో నూర్పిడి పనులు చేపట్టినా నష్టాలే చూడాల్సి వచ్చింది.

– మస్తాన్‌రెడ్డి, రైతు, మొగళ్లూరు

కోలుకోలేని విధంగా..



మినుము సాగును ఏటా చేస్తుంటా. ఈ ఏడాది బాగా నష్టం వచ్చేలా ఉంది. నూర్పిడి పనులు చేపడుతున్నా. బయటి ప్రాంతాల్లోనూ మినుము సాగు చేపట్టా. అక్కడా నష్టాలే వచ్చేలా ఉన్నాయి. వర్షాలను నమ్ముకొని పప్పు ధాన్యాలను సాగు చేయడంతో కోలుకోలేకపోతున్నాం.

– వెంకటేశ్వర్‌రెడ్డి, రైతు, మొగళ్లూరు.

కాకాణితో పలువురు నేతల భేటీ



కాకాణితో ప్రసన్నకుమార్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు) : మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డితో పలువురు నేతలు భేటీ అయ్యారు. నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న కాకాణి క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, కోవూరు ఇన్‌చార్జి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ, నగర ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతంపై చర్చించారు. కొడవలూరు మండలంలో పలువురు సర్పంచ్‌లకు చెక్ పవర్ రద్దుపై వారు కాకాణి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కాకాణి మాట్లాడుతూ చెక్‌పవర్ రద్దుపై న్యాయ పోరాటం చేస్తామని, పోలీసు కేసులకు భయపడమని స్పష్టం చేశారు.

వేధింపులకు నిరసనగా ధర్నా రేపు



మాట్లాడుతున్న చలపతిరావు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు

కొడవలూరు : నార్తురాజుపాళెంలో టీడీపీ నేతల దందాలను స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకుపోతామని, వారి వేధింపులకు నిరసనగా రేపు ధర్నా చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు స్పష్టం చేశారు. మండలంలోని నార్తురాజుపాళెం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. గ్రామంలోని టీడీపీ నాయకులు నాలుగు గ్రూపులుగా ఏర్పడి గ్రామాన్ని నాశనం చేస్తున్నారన్నారు. ఓ నాయకుడు గ్రామంలో వివిధ రకాల జూదాలను నిర్వహిస్తుండడంతో పాటు గంజాయి విక్రయాలకు గ్రామాన్ని కేంద్రంగా మార్చారని తెలిపారు. అంబేడ్కర్ వారసులమని చెప్పుకునే గ్రామానికి చెందిన ఇద్దరు నాయకులు ఇష్టానుసారం దందాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఒక నాయకుడు లిక్కర్ దుకాణాలు, ఆటో స్టాండ్‌ల వద్ద వసూళ్లు చేస్తుంటే.. మరో నాయకుడు ప్రభుత్వ భూములు ఆక్రమించారంటూ రైతులను భయభ్రాంతులకు గురి చేసి కాసులు దండుకొంటున్నారని చెప్పారు. గ్రామంలోని యువతను పూర్తిగా పెడదోవ పట్టిస్తున్నారని చెప్పారు. టీడీపీ నేతల వైఖరిని నిరసిస్తూ శుక్రవారం కొడవలూరు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్‌లు బి.సుప్రియ, ఎం.రంగారెడ్డి, ఎంపీటీసీ కామాక్షి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిమటా శేషగిరి, నాయకులు పి.నాగశ్రీనివాసులురెడ్డి, కొండా శ్రీనివాసులురెడ్డి, మాణిక్యరావు, ఎండీ.కరిముల్లా పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



ప్రసన్నకు పూలమొక్క అందజేస్తున్న నవీన్‌రెడ్డి

విడవలూరు : మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి నవీన్‌రెడ్డి బుధవారం నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రజత్‌కుమార్‌రెడ్డిని కూడా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు పూండ్ల అచ్యుత్‌కుమార్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వే బ్రిడ్జి మూసివేతకు ఆదేశాలు

పొదలకూరు: పట్టణంలోని మనుబోలు రోడ్డులో గల వే బ్రిడ్జిని మూసేయాల్సిందిగా ఎంపీడీఓ నరసింహారావు ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. ఈ మేరకు వే బ్రిడ్జి వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. కామాక్షి వే బ్రిడ్జికి అనుమతుల్లేవని, ఉత్తర్వులను ధిక్కరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అందులో పేర్కొన్నారు.

సీసీ రోడ్ల ప్రారంభం

మనుబోలు: సర్వేపల్లి నియోజకవర్గంలో రూ.పది కోట్లతో 130 పనులతో ఇరిగేషన్ వ్యవస్థకు కొత్త రూపు తెచ్చామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వడ్లపూడిలో రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను బుధవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. వడ్లపూడి సాగునీటి సంఘ పరిధిలో రూ.63 లక్షలతో ఏడు పనులను రైతుల భాగస్వామ్యంతో పూర్తి చేశామని తెలిపారు. చెర్లోపల్లిలో టీడీపీ నేత పాపన రమణయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమాదేవి, ఎంపీడీఓ జలజాక్షి, నేతలు ధనేకుల రఘురామనాయుడు, గాలి రామకృష్ణారెడ్డి, పొన్నూరు అశోక్, పూండ్ల రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలను తరలిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరి

బుచ్చిరెడ్డిపాళెం : చికెన్ వ్యర్థాలను చేపల గుంతల్లో వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ శ్రీహరి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎస్సై సంతోష్‌రెడ్డి, మత్స్యశాఖ అధికారి తాతయ్య మాట్లాడారు. చేపల గుంతల్లో చికెన్ వ్యర్థాలు వినియోగించకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. దీనిపై గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీస్, వీఆర్వోలతో బృందంగా ఏర్పడి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు.

ఉచిత న్యాయసేవలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి వాణి

తోటపల్లిగూడూరు: న్యాయస్థానాల ద్వారా పేదలకు అందుతున్న ఉచిత న్యాయసేవలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి సూచించారు. మండలంలోని పేడూరు పంచాయతీ కొలిదిబ్బ గిరిజన కాలనీలో బుధవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉచిత న్యాయసేవలు పొందాలనుకొనే వారు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ట్రోల్ ఫ్రీ నంబర్ 15100ను సంప్రదించాలని సూచించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి

కోవూరు : గ్రామంలోని ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా ఆదర్శ గ్రామ పంచాయతీగా గుర్తింపు పొందాలని ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి ఆకాంక్షించారు. మండలంలోని పడుగుపాడు పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామసభ జరిగింది. ముఖ్యఅతిథిగా జెడ్పీటీసీ సభ్యురాలు కవరగిరి శ్రీలత, ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి పాల్గొని, మాట్లాడారు. గ్రామంలోని సమస్యలను గుర్తించి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పరిష్కరించే దిశగా అడుగులు వేయాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి హజరత్‌బాబు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

తాటిపర్తిలో ఫీవర్ సర్వే

పొదలకూరు: మండలంలోని తాటిపర్తిలో జ్వరాలపై ఇంటింటి సర్వేను మహ్మదాపురం పీహెచ్‌సీ సిబ్బంది బుధవారం నిర్వహించారు. మలేరియా ర్యాపిడ్ కిట్ల ద్వారా పరీక్షలు జరిపి, సీరమ్ శాంపిళ్లు, రక్త నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. గ్రామంలో జ్వరాలు ప్రస్తుతం అదుపులో ఉన్నాయని, అయితే జ్వర పీడితులకు కీళ్లనొప్పులు, శరీరంపై దద్దుర్లు ఉండటంతో వైద్యాధికారి నరసింహారావు ఆదేశాల మేరకు నాలుగు బృందాలు సర్వేను నిర్వహించాయి. మొత్తం 102 మంది రక్త నమూనాలను సేకరించారు. ఆరోగ్య సహాయకులు కవిత, పెంచలయ్య, సుశీల, చంద్రమౌళి, శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో రంగోత్సవ్



ఇందుకూరుపేట : మండలంలోని పల్లిపాడు డైట్ కళాశాలలో రంగోత్సవ్–2025 కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్, ప్రస్తుత ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో కళా నైపుణ్యాలను వెలికితీయడమే రంగోత్సవ్ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం క్విజ్, చిత్రలేఖనం, చేతిరాత, ముగ్గులు, జానపద నృత్యం తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా బి.దశరథరామిరెడ్డి, అచ్యుతమణి, అనూష వ్యవహరించారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు నర్సింగరావు, దాస్, విజయచంద్ర, శివ, షఫీ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి



సూచనలు చేస్తున్న ఖాదర్‌వలీ

వెంకటాచలం: కుష్టు వ్యాధిగ్రస్తులను ప్రాథమిక దశలోనే గుర్తించి, చికిత్స చేయించాలని జిల్లా లెప్రసీ అధికారి ఖాదర్‌వలీ సూచించారు. వెంకటాచలం సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న లెప్రసీ సర్వేను బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. వ్యాధిగ్రస్తులను గుర్తించి కసుమూరు పీహెచ్‌సీకి వెంటనే తీసుకెళ్లాలని సిబ్బందికి సూచించారు. సీహెచ్‌ఓ రామసుబ్బారెడ్డి, ఏఎన్‌ఎం సుగుణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశు వైద్యశిబిరాలు



ఇందుకూరుపేట : పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని జగదేవిపేట, ముదివర్తిపాళెం, మైపాడు, కొత్తూరు గ్రామాల్లో బుధవారం పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. మైపాడులో ఏడీ డాక్టర్ మురళీకృష్ణ పాల్గొని, మాట్లాడారు. బుధవారం జరిగిన శిబిరాల్లో 225 లేగ దూడలకు, 300 పశువులకు నట్టల నివారణ మందులు అందించామన్నారు. మండవ ఫౌండేషన్, స్వర్ణభారత్ ట్రస్ట్ సహకారంతో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఏడీ వెంకటేశ్వరనాయుడు పాల్గొని పశువులకు వైద్యసేవలు అందించారు. వైద్యాధికారులు అస్లామ్ అత్తర్, కె.హరిబాబు, జి.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పంటలను నమోదు చేసుకోవాలి



పొదలకూరు: అవగాహన కల్పిస్తున్న వాసు

పొదలకూరు: గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో పంటలను అన్నదాతలు నమోదు చేసుకోవాలని ఏఓ వాసు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని సూరాయపాళెం, విరువూరులో రైతులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటలను నమోదు చేసుకోవడం ద్వారా కొనుగోలు కేంద్రాల్లో తాము పండించిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఎలుకల మందును రైతులకు ఉచితంగా అందజేయనున్నామని తెలిపారు. ఏఈఓ నాయక్, వీఏఏ సాయిప్రవీణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మనుబోలు: పొలాల్లో ఎలుకలను నివారిస్తేనే పూర్తి దిగుబడి చేతికంది రైతులకు లాభాలొస్తాయని వ్యవసాయ శాఖ ఏడీ శివనాయక్ పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని పిడూరులో నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి జహీర్, ఏఈఓ కళారాణి తదితరులు పాల్గొన్నారు.

ఈ–పంట నమోదు తప్పనిసరి

విడవలూరు : రైతులు తప్పకుండా ఈ–పంట నమోదు చేసుకోవాలని మండల ఏఓ పి.వెంకటకృష్ణయ్య కోరారు. మండలంలోని దండిగుంట, రామచంద్రాపురం గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఈ–కేవైసీ చేయించుకోవాలని కోరారు. అనంతరం గ్రామాల్లోని పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో వీఏఏ వెన్నెల, స్థానిక రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

కోవూరు : రైతులు సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏఓ ఇందిరావతి కోరారు. మండలంలోని పడుగుపాడు, ఇనమడుగు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఇందులో ఆమె పాల్గొని, పలు సూచనలు చేశారు. వీఏఏలు సుభాషిని, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కాండం తొలుచు పురుగును నివారించుకోండి

కొడవలూరు : వరిలో కాండం తొలుచు పురుగును వెంటనే నివారించుకోవాలని కోవూరు ఏడీఏ డి.సుజాత సూచించారు. మండలంలోని తలమంచి, దామేగుంట గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆమె హాజరై, మాట్లాడారు. కాండం తొలుచు పురుగు నివారణకు కార్ టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అదేవిధంగా చిరుపొట్ట దశలో పొటాష్ ఎరువును విధిగా వాడుకోవాలని చెప్పారు. అనంతరం సామూహిక ఎలుకల నివారణను ప్రయోగాత్మకంగా వివరించారు. బ్రోమోడైలిన్ మందును ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ లక్ష్మి, వీఏఏలు ఎస్.ప్రసాద్, బి.లిఖిత, స్థానిక నాయకులు గల్లా కృష్ణ, జొన్నా ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.



విడవలూరు: మాట్లాడుతున్న ఏఓ



మనుబోలు: పిడూరులో..



కోవూరు : అధికారుల క్షేత్ర సందర్శన



కొడవలూరు : దామేగుంటలో..